
శిక్ష-1
మధుబాబు

# శిక్ష

రచన
మధుబాబు

Kinige

SIKSHA
(Serialized in Swathi Weekly)

By
MADHU BAABU

Published by :
SRI SRINIVASA PUBLICATIONS
4/4, A.T. Agraharam, Guntur – 522004
Ph : 0863-2357945

Edition : April 2011

This book is digitized and brought to you by KINIGE

© Author
© Madhu Baabu
This digital book is published by -
కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

# శిక్ష – 1

చెవులు చిల్లులు పడేలా కూతలు పెడుతూ ప్లాట్‌ఫాం మీదికి వచ్చింది చెన్నయ్ వెళ్ళే ఎక్స్‌ప్రెస్ రైలు.

రెండు గంటలు లేటు కావడంతో ఆదరా బాదరాగా పరుగులు తీశారు, అప్పటివరకూ అసహనంగా ఎదురుచూస్తున్న ప్రయాణీకులు.

దిగేవాళ్ళను దిగనీయకుండా, ఎక్కేవాళ్ళను ఎక్కనీయకుండా, సైంధవుల్లా అడ్డం పడటం మొదలుపెట్టారు ప్లాట్‌ఫాం మీద టీ, కాఫీలు, టిఫిన్లు అమ్ముకునే వెండార్స్.

అరుపులు, కేకలు మధ్య మధ్యలో రైల్వేవారి ఎనౌన్స్‌మెంట్లు గందరగోళం పరిస్థితి నెలకొంది అక్కడ.

ఆరు దినపత్రికల్ని, ఆరు వార్తాపత్రికల్ని, పిల్లలు చూడకూడని రెండు మూడు ఎల్లో మేగజైన్స్‌ని బండిల్‌గా కట్టి బాచి చేతికి అందించాడు అప్పలనాయుడు.

"జనరల్ కంపార్ట్‌మెంట్ దగ్గరికి పోయి టైమును వేస్ట్ చేసుకోకు... రిజర్వుడు పెట్టెల్లోనే వీటికి గిరాకీ వుంటుంది. తొందరగా వెళ్ళి, అయిపోగానే వచ్చేయ్. ఇంకో బండిల్ రెడీగా వుంచుతాను. వెళ్ళు... వెళ్ళు" అంటూ ముందుకు నెట్టాడు.

పది సంవత్సరాల వయసుంటుంది బాచీకి. నాలుగేళ్ళనుంచీ ఆ ప్లాట్ ఫాం మీద పని చేస్తూనే వున్నాడు. ప్రతిరోజూ చెన్నయ్ ఎక్స్‌ప్రెస్ వస్తూనే వుంటుంది. వచ్చిన ప్రతీసారీ అప్పలనాయుడి నోటివెంట వచ్చే డైలాగులు అవే...

"ఒకసారి చెప్పావుగా బాబాయ్! అదే మాటని మళ్లీ మళ్ళీ చెప్పటం దేనికి?" అని అతనితో అనాలని ఎన్నోసార్లు ప్రయత్నం చేశాడు.

ఆటలమ్మ మచ్చలతో, పెద్ద పెద్ద మీసాలతో సినిమా విలన్‌లా వుండే అప్పలనాయుడి ముఖంలోకి సూటిగా చూసిన మరుక్షణం దిగజారిపోతూ వుంటుంది అతని ధైర్యం.

చెప్పిన మాటకు ఎదురుచెప్పినా, వ్యాపారంలో బద్ధకాన్ని ప్రదర్శించినా అగ్గిరాముడయిపోతాడు అప్పలనాయుడు. అరచేతులతో వెన్నుమీద చరిచి నేలను కరుచుకునేటట్లు చిత్రహింసలు పెడతాడు.

చూస్తూ చూస్తూ ఆ పరిస్థితిని ఆహ్వానించుకోవటం దేనికి? తన దగ్గిరవున్న మేగజైన్ల పేర్లను పెద్దగా ఉచ్ఛరిస్తూ ట్రైన్ దగ్గరికి పరిగెత్తాడు బాచి.

ఆ రోజు అతని అదృష్టం బాగుంది. రెండే రెండు నిముషాల్లో తీసుకువెళ్ళిన బండిల్ మొత్తం హాట్ కేకుల్లా అమ్ముడైపోయింది. తూనీగ మాదిరి రివ్వునపోయాడతను అప్పలనాయుడు దగ్గరికి.

రెడీగా వున్న రెండో బండిల్ ను తీసుకుని ఇంకో కంపార్టుమెంట్ ఎక్కాడు. రెండు దినపత్రికల్ని అమ్మాడో లేదో, అక్కడ ప్రారంభమైందో గలాటా.

“కొట్టండి, ఇంకోసారి ఇటువంటి పనులు చేయకుండా విరగకొట్టండి” గొంతులు చిరిగేలా అరుస్తూ, పిడికిళ్ళతో ఎడాపెడా పొడవటం మొదలు పెట్టారు ఇద్దరు ప్రయాణీకులు బాచి వయస్సుండే బాబీని.

భరించరాని బాధతో మెలికలు తిరిగిపోతూ కంపార్ట్‌మెంట్‌లో చతికిలబడిపోయాడు బాబిగాడు.

“రైల్వే పోలీసుల్ని పిలవండి. రైలు కదిలే వేళవుతోంది” తన సీటులో కదలకుండా సలహా ఇస్తున్నాడు ఒక ప్రయాణీకుడు.

“ఏమైంది సార్? ఎందుకు కొడుతున్నారు అతన్ని?” అమాయకంగా అతన్ని అడిగాడు బాచి.

“కొట్టాలా నరికి పోగులు పెట్టాలా? వేలెడు లేడు వెధవ, మెళ్ళో వున్న చైన్‌ని తెంపుకుపోవటానికి ట్రై చేశాడు.” పమిటచెంగును భుజాలనిండా కప్పుకుని తన మెడలోని నగలను మరుగుపరుచుకుంటున్న ఒక మధ్య వయస్కురాలిని చూపిస్తూ చెప్పాడు ఆ ప్రయాణీకుడు.

“పోలీసుల్ని పిలవండి... వాళ్లే చూసుకుంటారు. మీరు చెయ్యి చేసుకోవద్దు. తగలరానిచోట తగిలి వాడు గుటుక్కుమంటే లేనిపోని రిస్కు” ఉన్నట్లుండి తన అభిప్రాయాన్ని వెల్లడించాడింకో ప్రయాణీకుడు.

కంపార్టుమెంట్‌లో వెల్లకిలా పడిపోయాడు బాబి... పెదవులు తెగి ఎర్రటి రక్తం దుస్తులమీద పడి కాస్తంత భయంకరంగానే కనిపిస్తోంది. చూస్తూ నిలబడితే నిజంగానే గుటుక్కుమంటాడేమోనన్న అనుమానం కలిగి, ముందుకు అడుగువేశాడు బాచి.

"ఓరినీ... వీడా... వీడు నాకు బాగా తెలుసు సార్. మూడోనెంబర్ ప్లాట్‌ఫాం మీద పాప్‌కారన్ ప్యాకెట్లు అమ్ముకుంటూంటాడు. వ్యాపారంలో వస్తున్న డబ్బులు చాలవని, ఈ పాడుపని చేసినట్టున్నాడు.

దయచేసి ఈ ఒక్కసారికి వదిలేయండి. వీడి పేరెంట్స్‌కి చెప్పి డొక్క చీల్పిస్తాను. ఇంకెప్పుడూ ఇటువంటి పనులు చేయకుండా బుద్ధి చెప్పిస్తాను" బ్లడ్ ప్రెషర్ పెరిగిపోవటం వల్ల కాబోలు, బాగా ఆయాసపడిపోతున్న ప్రయాణీకులు ఇద్దర్నీ వేడుకున్నాడు.

"వదలద్దు. వాడినీ పట్టుకోండి. వాడు వీడికి దోస్తు అయివుంటాడు" అరిచాడింకో ప్రయాణీకుడు.

"వీడు నాకు తెలుసుని అన్నాను గాని, వీడికి నేను దోస్తని అనలేదు. వీడికి, నాకు ఏ విధమైనటువంటి సంబంధంలేదు. నేను న్యూస్ పేపర్లు అమ్ముకునే కుర్రాడిని, కావాలంటే చూడండి" అంటూ తన దగ్గిర వున్న పేపర్స్ బండిల్‌ని అతనికి చూపించాడు బాచి.

"పట్టుబడనంతవరకూ అందరూ మంచివాళ్ళే... పట్టుబడ్డాకగాని అసలు రూపం బయటపడదు. అనవసరమైన మాటలు మాని పోలీసుల్ని పిలవండి."

ఆ గొడవను త్వరగా ఎండ్ చేయాలన్న ఉద్దేశ్యంతో తన అభిప్రాయాన్ని ఇంకోసారి వెల్లడించాడు అంతకుముందు అదే సలహాను ఇచ్చిన పెద్దమనిషి.

"పోలీసుల్ని పిలిస్తే ఈ గొడవ ఇక్కడితో ఆగిపోదు సార్. వీడితో పాటు మిమ్మల్నీ ట్రైన్ దగి రమ్మంటారు. రిపోర్టులు రాసి సంతకాలు పెట్టమంటారు. ఈ లోపల ట్రైన్ కదిలిపోతుంది. మీరు నెక్ట్స్ ట్రైన్ కోసం ఇక్కడే వుండాలి. బాగా

ఆలోచించుకోండి'' ఒక్కొక్క మాటను జాగ్రత్తగా ఉపయోగిస్తూ, జరగబోయేది ఏమిటో అక్కడి వారందరికీ చక్కగా వినిపించాడు బాచి.

సాధారణమైన రైలు ప్రయాణీకులు ఎలా ప్రవర్తిస్తారో, అలాగే రియాక్ట్ అయ్యారు అక్కడున్నవారు.

''రిపోర్టులు, సాక్ష్యాలు ఇవన్నీ మన ఒంటికి సరిపడే పనులు కావు. దొంగతనం చేయటానికి ట్రై చేశాడు గాని దొంగిలించలేదు కదా... అందుకని ఇంకో రెండు దెబ్బలు తగలనిచ్చి వదిలేయండి. వాడిని పట్టివ్వటం కోసం ప్రయాణాన్ని మానుకునే తీరిక ఎవరికీ లేదు'' ఆచితూచి సలహా ఇచ్చాడు అంతకుముందు పోలీసుల ప్రసక్తి ఒకటికి రెండుసార్లు తీసుకొచ్చిన పెద్దమనిషి.

బ్లడ్ ప్రెషర్ పెరిగిన ప్రయాణీకులు ముందుకొచ్చి మళ్లీ చేయి చేసుకోకముందే తనే బాబీగాడి వెన్నుమీద టపటపా రెండుదెబ్బలు వేశాడు బాచి.

''వద్దు వద్దని ఎంత చెప్పినా వినిపించుకోకుండా వెధవ పనులు చేయటం... ఒళ్ళు హూనం చేయించుకోవటం... మీ నాన్నతో చెప్పి నీ నడుములు విరగేయించకపోతే నాకు మారుపేరు పెట్టు. పదరా పద పద'' అంటూ అతని చేయి పట్టుకుని పైకి లేవతీశాడు బాచి.

రెప్పలు వాల్చకుండా చూస్తున్న ప్రయాణీకులు తమ మనసులు మార్చుకుని మరోసారి పోలీసుల్ని పిలవమనే స్లోగన్‌ని అందుకోకముందే పట్టాల వైపు వుండే ద్వారంలోంచి బాబీగాడిని కిందికి తీసుకెళ్ళాడు.

పట్టాల్ని క్రాస్ చేసి మూడోనెంబరు ప్లాట్‌ఫాం మీదికి చేరుకోకముందే పెద్దగా కూతపెట్టి కదలనే కదిలింది చెన్నయ్ ఎక్స్‌ప్రెస్. చూస్తూ చూస్తూ వుండగానే వేగాన్ని పుంచుకుని దూరంగా వెళ్ళిపోయింది.

అంతవరకూ పళ్లబిగువున నిలబడిన బాబీగాడిని అప్పుడు ముంచుకు వచ్చేసింది దుఃఖం. బావురుమని ఏడుస్తూ పట్టాలమీదే కూలబడ్డాడు.

అతని దుస్తులమీది రక్తం తగిలి తన దగ్గిర వున్న బండిల్ మలిన పడిపోకుండా దూరంగా ఓ రాయిమీద పెట్టి, అతని తలమీద చేయివేశాడు బాచి.

“ఏడవకురా... జరిగిందేదో జరిగిపోయింది... ఏడిస్తే నెప్పి తగ్గుతుందా? ఇంటికిపోయి కాస్సేపు కదలకుండా పడుకో...” అంటూ అనునయించాడు.

“ఇంటికా? ఇంటికి పోవాలా?” తల ఎత్తి అతని ముఖంలోకి చూస్తూ అడిగాడు బాబిగాడు.

“అవునురా... ఇంటికే... చొక్కా అంతా నెత్తురు మయమైపోయింది. ఈ చొక్కాతో ప్లాట్‌ఫాంమీద తిరిగితే అందరి దృష్టి నీమీదే పడుతుంది. అది ఇంకా పెద్ద ప్రమాదం. ఇంటికి వెళ్ళు” అన్నాడు బాచి.

“నిన్న ఎవరో మినిష్టర్ గారు వస్తున్నారని స్టేషనంతా పోలీసులే నిలబడ్డారు. మొన్నంతా ఎయిటీ టూ డవున్ యాక్సిడెంట్ కారణంగా ప్లాట్‌ఫాం మీద పిట్టకూడా కనిపించలేదు. రెండు రోజుల్నుంచీ ఏమీ తీసుకు రాలేదని పిన్నికి చాలా కోపంగా వుంది. ఇవాళ కూడా వట్టిచేతులతో ఇంటికి పోతే నా ముఖం పచ్చడి అయిపోతుంది” బిక్కముఖంతో చెప్పాడు బాబిగాడు.

“అలాగని చెప్పి ఈ నెత్తురు మరకలున్న చొక్కాతో ప్లాట్‌ఫాం మీద తిరిగితే మొదటికే మోసం వస్తుంది. చితకకొట్టి తీసుకుపోయి జైల్లోకి నెడతారు మన బాబాయిలు. పిన్నికి నేను సర్ది చెపుతాను. నువ్వు ఇంటికి వెళ్ళిపో...” అంటూ అతన్ని బలవంతంగా పట్టాలమీది నించి లేపి ప్లాట్‌ఫాంమీదికి పంపించాడు బాచి.

“వెళ్ళు... ముందు నువ్వు ఇంటికి వెళ్ళు...” అని ఇంకోసారి అతన్ని హెచ్చరించి, దూరంగా రాయిమీద పెట్టిన తన బండిల్‌ని తీసుకుని వెనక్కి వచ్చాడు.

“నీ పనేదో నువ్వు చూసుకోకుండా ఆ బాబీగాడికి హెల్పు చేయటం దేనికి? నీ మూలకంగా నా వ్యాపారం నష్టపోయింది. మూడు బండిల్స్ అమ్మాల్సిన వాడివి వెర్రిముఖం సేసుకుని వెనక్కి తిరిగి వచ్చావ్... ముందు నీ తిత్తి తీసేయాలి” ఎర్రబడిన ముఖంతో వేడిగా, వాడిగా అన్నాడు అప్పలనాయుడు అతన్ని చూడగానే.

“నిన్న పదిబండిల్స్ అమ్మాను... మొన్న ప్లాట్‌ఫాంమీద పిట్ట కూడా లేకపోయినా ఏడు బండిల్స్‌ని వదిలించేశాను. ఇవాళ ఒక్కరోజు ఏదో జరిగిందని చెప్పి నోటికి వచ్చినట్లు మాట్లాడటం మంచిగా లేదు” అని అనాలని అనుకున్నాడు బాచి. కాని బ్రహ్మరాక్షసుడి మాదిరి నిలబడిన అప్పలనాయుడి వికృత వదనం వైపు చూస్తుంటే ఎప్పటి మాదిరి నోటిలోనే ఆగిపోయాయి ఆ మాటలు.

“మాట్లాడవేమిటిరా? పూడుకుపోయిందా గొంతు? నా నష్టానికి సమాధానం చెప్పు” మరింత కోపంగా అడగబోయిన అప్పలనాయుడు కూడా ఆ మాటల్ని తనలోనే అతి ప్రయత్నంమీద అదుముకున్నాడు. బెంగుళూరు వైపు వెళ్ళే

ట్రైన్ ఆ ప్లాట్‌ఫాం మీదకే వస్తోందని ఎనౌన్స్‌మెంట్ వినరావటమే అందుకు కారణం.

"వెళ్ళు... త్వరగా వెళ్ళి నష్టాన్ని పూడ్చు...." అంటూ ఇంకో రెండు బండిల్స్ ని అతని మీదికి విసిరి తనపనిలో బిజీ అయ్యాడు అప్పలనాయుడు.

ట్రైన్ వచ్చి ప్లాట్‌ఫాం మీద ఆగిన క్షణంనుంచీ రెచ్చిపోయి అమ్మేశాడు బాచి... మొదట్లో తెచ్చిన మూడు బండిల్స్‌ని వదిలించేసుకున్నాడు. ఇక మర్నాటి ఉదయంవరకూ అప్పలనాయుడి చేతిలో తిట్లు తినాల్సిన అవసరం లేదని సంతోషిస్తూ వెనుతిరగబోతుండగా, ఒక కంపార్టుమెంట్‌లో నుంచి వినవచ్చింది ఇంకోరకమైన గందరగోళం.

బాబీగాడి వంటి పాకెట్‌మార్‌ల వల్ల సృష్టించబడ లేదది. అదేపనిగా ప్రయాణాలు చేస్తూ, సరయిన తిండి లేకపోవడం వల్ల క్రియేట్ అయినటువంటిది.

"చచ్చిపోతున్నాను... నేను బతకను... నా పని అయిపోయింది" పొట్టను నొక్కుకుంటూ కేకలు పెడుతోంది ఓ పదహారు సంవత్సరాల అమ్మాయి.

"తీసుకుపొండి... డాక్టర్లు వుంటారు... వెంటనే దిగి వాళ్ళదగ్గరికి తీసుకుపొండి" అంటున్నారు తోటి ప్రయాణీకులు సానుభూతి కురిపిస్తూ.

అమ్మాయిని డాక్టర్లు దగ్గిరికి తీసుకుపోవటం అంటే, తమ ప్రయాణానికి బ్రేక్ తీసుకోవడమే అని తెలిసి బిక్కముఖాలేస్తున్నారు ఆ పిల్ల పేరెంట్స్.

ద్రవించిపోయింది ఆ దృశ్యాన్ని చూసిన బాచి మనసు. క్షణం ఆలస్యం చేయలేదతను. ఆఘమేఘాలమీద నెంబర్ టు ప్లాట్‌ఫాం మీదికి పరిగెత్తాడు.

ప్లాట్‌ఫాం మొదట్లోనే వుంది అగర్వాల్ మెడికల్ షాపు. అతను చెప్పిన లక్షణాల్ని వినగానే అప్పటికప్పుడు రెండు టాబిలెట్స్ తీసి ఇచ్చాడు అగర్వాల్.

"నీళ్ళతోనే వేయించు... నెప్పి వెంటనే సర్దుకుంటుంది. ట్రైన్ దిగగానే డాక్టర్ దగ్గిరికి వెళ్ళమని చెప్పు" అంటూ అతను ఇచ్చిన నోటుకు చిల్లర ఇచ్చి, ఒక చాక్లెట్‌ని బోనస్‌గా బాచిచేతిలో పెట్టాడు అతను.

పరిగెత్తుతూనే చాక్లెట్‌ని నోట్లో వేసుకుని, పట్టాల్ని క్రాస్ చేసి బెంగుళూరు ట్రైన్ దగ్గిరకొచ్చాడు.

బాధతో బిగ్గరగా అరుస్తూనే వుందా పిల్ల.

డాక్టర్ దగ్గిరికి తీసుకుపొమ్మని సలహాలు ఇస్తూనే వున్నారు తోటివారు. ఎటూ తేల్చుకోలేక కన్నీళ్ళ పర్యంతం అవుతూనే వున్నారు ఆ పిల్ల పేరెంట్స్.

"ఇవిగో టాబిలెట్లు... మంచినీళ్ళతో వేయండి. ఆలస్యం చేయకండి" కిటికీ ఊచల్లో నుంచి తను తెచ్చిన టాబిలెట్లను ఆ పిల్ల తండ్రికిచ్చాడు బాచి.

క్షణంపాటు తటపటాయించాడు ఆ తండ్రి. ట్రైన్‌లో వుండగా పరాయివాళ్ళు ఇచ్చిన ప్రసాదాలు, తినుబండారాలు తిని, అన్యాయం అయిపోయిన వారి కథలు బహుశా ఆ సమయంలో గుర్తుకువచ్చి వుండవచ్చు.

"మెడికల్ షాపునుంచి తీసుకువచ్చాను సార్... తొందరగా వేయండి. క్షణాల మీద నెప్పి తగ్గిపోతుంది... వేయండి..." అతని తటపటాయింపుకు కారణం తెలిసినట్లు చిరునవ్వుతో అన్నాడు బాచి.

అయిష్టంగానే వేశాడు ఆ తండ్రి... బండి కదలటానికి రెడీ అవుతున్న గంట మోగటం మొదలుపెట్టిన వెంటనే అరుపుల్ని ఆపి, నీరసంగా నవ్వింది ఆ పిల్ల.

“తగ్గింది... నెప్పి తగ్గిపోతోంది...” పొట్టను తడుముకుంటూ లోగొంతుకతో చెప్పింది తండ్రికి.

“ఇంటికి వెళ్ళగానే డాక్టరుకు చూపించమని మెడికల్ షాపు ఆయన చెప్పమన్నాడు... మరేం ఫరవాలేదుట...” అన్నాడు బాచి. ఆ మాటలు విని అప్రయత్నంగా నిండిపోయాయి ఆ పిల్లతండ్రి కళ్ళు కన్నీటితో.

ఒక్క క్షణం తటపటాయించాడు... బండి కదలటం మొదలు పెట్టగానే దుస్తుల్లోనుంచి వంద రూపాయల కాగితాన్ని తీసి బాచీ మీదికి విసిరాడు.

“థాంక్యూ... థాంక్యూ... థ్యాంక్యూ వెరీ మచ్... బెంగుళూరు వస్తే మా ఇంటికి రా... నా పేరు...” అని అంటుండగానే వేగాన్ని పుంజుకుంది ట్రైన్.

అతని పేరు ఏమిటో బాచీకి వినిపించలేదు. పేరే వినపడనప్పుడు అడ్రసు ఎలా వినిపిస్తుంది?

ఒకవేళ వినిపించినా తను ఆ స్టేషన్ ని వదిలిపెట్టి బెంగుళూరు వెళ్లటం సాధ్యపడుతుందా?

ఆ రోజు ప్లాట్‌ఫాంమీదికి వచ్చినప్పటి నుంచీ కళ్ళముందు కనపడని తమ పిన్ని ముఖం ఒక్కసారిగా ప్రత్యక్షం అయ్యేసరికి పంచదార వేసుకోకుండా కాఫీ తాగినట్టు చేదుగా తయారయింది అతని నోరు.

## End of Preview.

## Rest of the book can be read @

http://kinige.com/kbook.php?id=1823

* * *

**Read other books of Madhu Babu @**

http://kinige.com/kbrowse.php?via=author&name=Madhu+babu&id=20